
సాక్షి
తూర్పుగోదావరి

గురువారం | 29 | జూన్ | 2023



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి బుధవారం తూర్పు డెల్టాకు 1,860, మధ్య డెల్టాకు 1,340, పశ్చిమ డెల్టాకు 3,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 8.75 అడుగులకు నీటి మట్టం చేరింది.



ప్రమాణాలు పెంచే ప్రణాళిక

ప్రభుత్వం విద్యా ప్రమాణాలను పెంచేందుకు పలు రకాల సంస్కరణలను ప్రవేశ పెడుతోంది. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో విద్యా సంస్కరణలను ప్రవేశ పెట్టారు.

8లో

గరిష్టం/కనిష్టం
39.5° / 26.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	39.5	26.0
కాకినాడ	37.0	27.0
అమలాపురం	39.0	25.0

న్యూస్‌రీల్

దూరవిద్యలో వ్యవసాయ కోర్సులు

రాజమహేంద్రవరం రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం లాంపార మ్‌లో దూరవిద్యాకేంద్రం ద్వారా వ్యవసాయ సంబంధిత కోర్సులకు దరఖాస్తులు కోరుతున్నట్టు రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిషోర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులైన సేంద్రియ వ్యవసాయం, మిద్దెతోటల పెంపకం, తేనెటీగల పెంపకం, పుట్టగొడుగులు పెంపకంపై రెండు నెలల కాలపరిమితితో కోర్సులను నిర్వహించనున్నారు. ఒక్కొక్క కోర్సుకు రూ.1500 చొప్పున చెల్లించాలి. జూలై 20వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్జీఆర్ఏయూ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలి. 80878 8776, 83096 26619, 91105 62727 నంబర్లను ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ సంప్రదించవచ్చు. ఈ కోర్సులు చేయాలనుకునే అభ్యర్థులు ఇంటర్నెట్ సౌకర్యం కలిగి ఉండాలి.

ఎస్పీఎఫ్ కమాండెంట్‌గా కేఎన్ రావు



బాధ్యతలు స్వీకరిస్తున్న కేఎన్ రావు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం (ఎస్పీఎఫ్) రాజమహేంద్రవరం జోన్ కమాండెంట్‌గా డాక్టర్ కేఎన్ రావు బుధవారం రాజమహేంద్రవరంలోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇప్పటివరకూ విజయవాడ జోన్ కమాండెంట్‌గా పనిచేశారు. గత ఐదేళ్లుగా ఇన్‌చార్జి కమాండెంట్‌తో నడుస్తున్న ఈ జోన్‌కు పూర్తిస్థాయి అధికారిని ప్రభుత్వం నియమించింది. ఎస్పీఎఫ్ రాజమహేంద్రవరం జోన్ పరిధిలోకి ఉమ్మడి శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలో పనిచేస్తున్న సిబ్బంది వస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల సంస్థల ఆస్తులను కాపాడడంలో ఈ దళం కీలకభూమిక పోషిస్తోంది. రాజమహేంద్రవరం జోన్ పరిధిలోకి ఓఎన్జీసీ, రిల్ కాకినాడ, అన్నవరం, సింహాచలం దేవాలయాలు, బ్యాంక్ కరెన్సీ చెస్ట్‌లు, పోలవరం ప్రాజెక్టు, నాల్కో, విశాఖపట్నం, రాజమహేంద్రవరం విమానాశ్రయాలు వస్తాయి.

పీజీ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపల్ కృష్ణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆర్ట్స్ కళాశాలలో ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చప్పిడి కృష్ణ బుధవారం విడుదల చేశారు. ఎంకాంలో నూరుశాతం, ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో 92.5 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే మెరుగైన ఫలితాలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పి.బాబ్జీ, అకాడమిక్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎంఆర్ గౌతమ్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ.అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఆరు ఇసుక రీచ్‌లకు ఆమోదం

సీటీఆర్ఐ: జిల్లాలో ఆరు ఇసుక రీచ్‌లకు ఆమోదం తెలిపినట్లు జిల్లా కలెక్టర్ మాధవీలత తెలిపారు. తీపర్రు, పెండ్యాల - కానూరు, పెండ్యాల, కుమారదేవం, చిడిపి-2, చిడిపి- 3లలో ఓపెన్ రీచ్‌లకు జిల్లా కమిటీ ఆమోదం లభించిందన్నారు. అందుకు అనుగుణంగా మైనింగ్ ప్లాన్, పర్యావరణ అనుమతులు పొందాలని ఆమె ఆదేశించారు. బుధవారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ఆగస్టు 31 వరకూ రివర్ కన్సర్వేటర్ నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ జారీచేసిన డిసిల్టేషన్ రీచ్‌లకు (కొవ్వూరు డివిజన్‌లో 11 ర్యాంపు పాయింట్లు, రాజమహేంద్రవరం డివిజన్‌లో 24 ర్యాంపు పాయింట్లకు) ఆమోదం తెలిపిన్నట్లు పేర్కొన్నారు. వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా ఇసుక నిల్వ చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. నాడు-నేడు, ప్రభుత్వ ప్రాధాన్యత పనులకు ఇసుక కొరత లేకుండా సరఫరా చేయాలని జయప్రకాష్ పవర్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులను ఆదేశించారు. నల్లజర్ల మండలంలో స్థానిక అవసరాలకు, గృహ నిర్మాణాలకు 3వ ఆర్డర్ స్ట్రీం నుంచి ఇసుక తీసుకునేందుకు కమిటీ ఆమోదించిందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్, జిల్లా మైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం, ఆర్డీవో మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

తుస్సుమన్న బస్సుయాత్ర

- భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో టీడీపీ బస్సు యాత్ర
- తూర్పులో ఫలించని కుయుక్తులు
- నిడదవోలులో బయటపడిన అంతర్గత విభేదాలు
- టిడ్కో ఇళ్ల వద్ద బెడిసికొట్టిన నేతల పన్నాగం
- కొరవడుతున్న ప్రజా స్పందన



బొమ్మూరు టిడ్కో హౌసింగ్ కాలనీ బయటే ధర్నా చేస్తున్న టీడీపీ నేతలు



పెరవలిలో జనాలు లేక వెలవెలబోతున్న టీడీపీ బస్సుయాత్ర

సాక్షి, రాజమహేంద్రవరం: సార్వత్రిక ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో ప్రజల్ని మరోసారి మభ్యపెట్టేందుకు టీడీపీ కుయుక్తులు పన్నుతోంది. ఇందుకు రాజమహేంద్రవరంలో ఇటీవల నిర్వహించిన మహానాడు కార్యక్రమాన్ని వేదికగా రూపొందించిన 'భవిష్యత్‌కు గ్యారంటీ' బస్సు యాత్ర ఘోరంగా విఫలమైంది. దీంతో ఆ పార్టీ భంగపాటుకు గురైంది. మహానాడులో ప్రకటించిన మ్యానిఫెస్టోలోని హామీలపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లడంతో ఎలాగైనా ప్రజల్ని మోసం చేసి లబ్ధి పొందాలన్న తలంపుతో 'భవిష్యత్తుకు గ్యారంటీ' పేరుతో ఆ పార్టీ నాయకులు కొద్ది రోజులుగా బస్సు యాత్ర ప్రారంభించారు. తొలి మ్యానిఫెస్టోపై ప్రచారం చేసేందుకు టీడీపీ నేతలు జిల్లాలో చేపడుతున్న ఈ యాత్రకు ప్రజల మద్దతు కరువైంది. ఆశించిన స్థాయిలో ప్రజలు హాజరుకావడం లేదు. నాయకులు, కార్యకర్తలతోనే యాత్రను కానిచ్చేశారు. దీనికి తోడు నియోజకవర్గ నాయకుల మధ్య విభేదాలు యాత్రకు బ్రేకులు వేస్తున్నాయి.

నిడదవోలులో తలోదారి

బస్సు యాత్ర సందర్భంగా నిడదవోలు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, కుందుల సత్యనారాయణ వర్గాల మధ్య విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. మంగళవారం నియోజకవర్గంలో టీడీపీ చేపట్టిన భవిష్యత్‌కు గ్యారంటీ యాత్రను పెరవలి మండలం ముక్కామల, ఖండవల్లి, అన్నవరప్పాడు చేపట్టారు. ఈ యాత్రకు కుందుల వర్గీయులు దూరమయ్యారు. తనకు ప్రాధాన్యం లేని చోట వెళ్లడం ఎందుకని భావించి సొంత కార్యక్రమాలు చేసుకున్నారు. టీడీపీ నేతలు, కార్యకర్తలకు ఇళ్లకు వెళ్లి సొంతంగా ప్రచారం మొదలు పెట్టారు. వచ్చే ఎన్నికల్లో మద్దతు పలకాలని అభ్యర్థించారు. దీంతో యాత్రలో కేవలం బూరుగుపల్లి శేషారావే దర్శనమివ్వడంతో కుందు వర్గం గుర్రుగా ఉంది. అధిష్టానంతో తాడోపేడో తేల్చుకునేందుకు సన్నద్ధమవుతోంది. ఇదిలా ఉంటే.. ఇటీవల జనసేనలో చేరిన ఉండ్రాజవరం గ్రామానికి చెందిన సినీ నిర్మాత బీవీఎస్ ప్రసాద్‌కు పొత్తులో భాగంగా జనసేన టిక్కెట్ ఇస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ పరిణామం శేషారావు, కుందుల వర్గీయుల్లో ఉత్కంఠ రేపుతోంది. రెండిటికీ చెడ్డ రేవడిలా మిగిలిపోతామా? అన్న ప్రశ్న ఇరువర్గాల్లో ఉత్పన్నమవుతోంది.

క్యాడర్‌లో నిస్తేజం

నిడదవోలు నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, నియోజకవర్గ నాయకులు కుందుల సత్యనారాయణకు ఎవరికి పార్టీ టిక్కెట్ ఇస్తోందో తెలియక ఆ పార్టీ శ్రేణులు అయోమయానికి గురవుతున్నారు. గత కొన్ని నెలలుగా పార్టీ కార్యక్రమాలను ఇరువురు నేతలు వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. రాజమహేంద్రవరంలో ఇటీవల నిర్వహించిన మహానాడుకు సైతం పోటీపోటీగా డబ్బులు ఇచ్చి జనాన్ని తరలించారు. శేషారావు వర్గీయులు చంద్రబాబు, సత్యనారాయణ వర్గీయులు నారా లోకేష్ వర్గాలుగా విడిపోయి మరీ మాకంటే మాకే టిక్కెట్ అని ప్రచారం చేస్తుండటంతో పార్టీ క్యాడర్‌లో నిస్తేజం నెలకొంది.

తూతూ మంత్రంగా ధర్నా

టిడ్కో ఇళ్ల వద్ద ధర్నా పేరుతో ధవళేశ్వరం నుంచి తీసుకొచ్చిన ప్రజలను కూర్చోబెట్టి సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేసి జారుకున్నారు. ధర్నాలో కనీసం 50 మంది కూడా లేరంటే పార్టీపై ప్రజల్లో ఏ మేరకు విశ్వాసముందో అర్థమవుతోంది. మళ్లీ ఇంకోసారి వచ్చి మీ సమస్యలు వింటామని గోరంట్ల ఉచిత సలహా ఇవ్వడంతో ప్రజలు టీడీపీపై విశ్వాసం మరింత సన్నగిల్లింది. ఇప్పటికే మోసపూరిత హామీలతో బాబు కాలం నెట్టుకొస్తుంటే.. ఇప్పుడు నాయకులు మధ్యపెట్టేందుకు వస్తున్నారంటూ విమర్శలు గుప్పించారు. భవిష్యత్తు యాత్ర కాస్త విమర్శల యాత్రగా మారింది. ప్రతి సభ, సమావేశంలో వైఎస్సార్ సీపీ పార్టీపై బురదజల్లడం, సీఎంను తిట్టడమే లక్ష్యంగా సాగింది. తామేం చేస్తామన్న విషయం చెప్పడం పోయి సీఎంపై విమర్శలు గుప్పించడంతో ప్రజల్లో అసహనం నెలకొంది.

రాజమహేంద్రవరంలో షో ఫ్లాప్..!

రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు టిడ్కో ఇళ్ల వద్ద టీడీపీ నేతలు చేయాలనుకున్న షో ఫ్లాప్ అయింది. టిడ్కో గృహ లబ్ధిదారుల వద్దకు వెళ్లి హంగామా చేయాలనుకుని భావించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు జవహర్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరికి భంగపాటు ఎదురైంది. కాలనీ లోపలికి వెళ్లే ఎలాంటి సమస్యలు చెప్పకపోగా.. తమపై లబ్ధిదారులు ఎదురుతిరిగితే ఉన్న గౌరవం కాస్త పోతుందని భావించిన నేతలు లోపలికి వెళ్లే సాహసం చేయలేదు. లబ్ధిదారులతో సెల్ఫీ దిగి ప్రభుత్వంపై బురద జల్లేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. టిడ్కో ఇళ్లు పొందిన లబ్ధిదారుల ఎవరూ టీడీపీ నేతలకు మద్దతుగా నిలవకపోవడం, కాలనీ నుంచి బయటకు రాకపోవడంతో చేసేది లేక కాలనీ గేటు బయట బైఠాయించారు.

ఉద్యోగుల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

రాజమహేంద్రవరం సిటీ: ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు ట్రెజరీ ద్వారా వేతనాలు, పీఆర్సీ ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించడంతో థాంక్యూ సీఎం కార్యక్రమంలో భాగంగా నగర ఏపీ ఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులు బుధవారం ప్రకాశం నగరం కార్యాలయంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను మర్యాదగా పూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి సత్కరించి, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా కాంట్రాక్టు ఉద్యోగుల గోడు పట్టించుకున్న నాథుడే లేడని, వైఎస్సార్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వారి చిరకాల పర్మినెంట్ ఉద్యోగం కోరిక నెరవేర్చిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు మెరుగైన జీపీఎస్ పెన్షన్ అమలు చేయడం గొప్ప నిర్ణయమని, ఉద్యోగులు అడగకుండానే పీఆర్సీ ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో నగర ఎన్జీవో సంఘ అధ్యక్షులు వైవీఎస్ నాయుడు, కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సహాధ్యక్షుడు అనిల్, జేఏసీ కార్యదర్శి వేణుమాధవ్, ఉపాధ్యక్షులు మాధవరావు, దూరాన్, సత్యమూర్తి, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం నాయకులు డి.చటర్జీ, రాంబాబు, మోహన్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను కలిసిన ఏపీఎన్జీఓ నాయకులు

విద్యారంగంలో వినూత్న మార్పులు

- అమ్మఒడి కార్యక్రమంలో హోంమంత్రి వనిత
- 1,55,768 మంది తల్లుల ఖాతాలకు రూ.233.65 కోట్లు జమ
- పాల్గొన్న ఎంపీ భరత్ రామ్, కలెక్టర్ మాధవీలత



దేవరపల్లి జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన సభలో విద్యార్థులకు అమ్మఒడి నమూనా చెక్కును అందజేస్తున్న రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, ఎంపీ భరత్ రామ్, కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, జేసీ తేజ్‌భరత్

దేవరపల్లి: అ అంటే అమ్మఒడి... ఆ అంటే ఆంధ్రప్రదేశ్ అని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖా మంత్రి తానేటి వనిత అన్నారు. దేవరపల్లిలోని అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన జగనన్న అమ్మఒడి జిల్లాస్థాయి కార్యక్రమాన్ని బుధవారం ఆమె జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సభలో తానేటి వనిత మాట్లాడారు. చదువులే పిల్లలకు ఇవ్వగలిగే ఆస్తి అని నమ్మిన వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని మంత్రి అన్నారు. అందుకు అనుగుణంగా విద్యా విధానంలో ఆయన వినూత్న మార్పులు తీసుకువస్తున్నారన్నారు. నాడు-నేడు పనులు, అమ్మఒడి, గోరుముద్ద, వసతిదీవెన, విద్యాదీవెన, విద్యాకానుక, విదేశీ విద్య వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం అందజేస్తున్న ఈ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యారంగంలో వివిధ పథకాలకు రూ.66,722 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసినట్టు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న వీడియో ప్రదర్శన

ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ గతంలో నాణ్యమైన విద్యను అందించే పరిస్థితి ఉండేది కాదన్నారు. జగనన్న సీఎం అయ్యాక నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాలల్ని ఆధునీకరించి మౌలిక సదుపాయాలు కల్పించినట్టు చెప్పారు. స్కూళ్లు తెరిచే నాటికే జగనన్న విద్యాకానుక అందిస్తూ నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. అమ్మఒడి ఆర్థిక సాయంలో రూ.2 వేలు పాఠశాలల్లో నిర్వహణ చేపట్టడానికి తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయడం ముఖ్య ఉద్దేశమన్నారు. విమర్శించే వారికి విద్యా విధానంలో గతంలోనూ, ఇప్పుడు ఉన్న తేడా ఏవిధంగా ఉందో చిన్నారులకు ఆయన వీడియో ద్వారా చూపించడం ఆసక్తిగా నిలిచింది. కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ విద్యకు భద్రత కల్పించాలనే లక్ష్యంతో అమ్మఒడి పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఏపీ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసి పథకాలను రూపొందించిట్టు తెలిపారు.

అంబేడ్కర్ ఆశయ సాధన

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను సీఎం వైఎస్ జగన్ ముందుకు తీసుకువెళుతున్నారన్నారు. ప్రతి పేద విద్యార్థీ ఉన్నత చదువును అభ్యసించేలా విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నారన్నారు. జిల్లాలో 1,55,768 మంది తల్లుల ఖాతాలకు జమచేసే రూ 233.65 కోట్ల నమూనా చెక్కును విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో జేసీ తేజ్‌భరత్, డీఈఓ అబ్రహం, సర్పంచ్ కడిమి వీరకుమారి, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యులు పొట్టి స్వర్ణలత, చిగురుపల్లి శామ్యూల్, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, మండల ప్రత్యేక అధికారి జి. రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, హెచ్‌ఎం శ్రీలక్ష్మి, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, శాప్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

11 వేల మట్టి నమూనాల సేకరణ



భూసార పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లాలో 11 వేల మట్టి నమూనాలను సేకరించామని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. స్థానిక మార్కెట్‌యార్డులోని భూసార పరీక్షా కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మట్టి నమూనాలను త్వరితగతిన పరీక్షించి, ఫలితాలను రైతులకు అందజేయాలని సిబ్బందికి సూచించారు. ఆ ఫలితాలను బట్టి రైతులు ఎరువుల వాడకం చేపట్టాలన్నారు. సహాయ సంచాలకులు శ్రీనివాసరెడ్డి, వ్యవసాయాధికారులు సరళ, భీమరాజు, ఏఈవోలు ఎస్వీ శ్రీనివాస్, వేణుమాధవ్ పాల్గొన్నారు.

సురక్షలో 32,734 ఇళ్ల డేటా సేకరణ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రానికి జిల్లాలో 32,734 ఇళ్లను సందర్శించి, డేటా సేకరణ చేపట్టినట్టు కలెక్టర్ మాధవీలత అన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయ సంయుక్త కార్యదర్శి నారాయణ భరత్ గుప్తా బుధవారం సాయంత్రం తాడేపల్లి నుంచి జిల్లా కలెక్టర్లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జేసీ తేజ్ భరత్ ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 512 సచివాలయాల పరిధిలో ఉన్న 6,45,396 ఇళ్లను సందర్శించి, లబ్ధిదారుల నుంచి సమగ్ర సమాచారం తీసుకుంటామన్నారు. ఆ క్రమంలో ఇప్పటి వరకు 103 సచివాలయాలకు చెందిన 1,818 మంది వలంటీర్లు ఇంటింటి సర్వే ప్రక్రియలో పాల్గొన్నారన్నారు. ఇప్పటి వరకూ 32,734 గృహాలను సందర్శించి సర్వే చేపట్టగా, ఆయా వివరాలను డిజిటల్ సహాయకులు ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని డివిజన్ పరిధిలో ముగ్గురు, ప్రతి మండలంలో ఒక జిల్లా అధికారి పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారులు పి.వీణాదేవి, వి.శాంతమణి, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.

వాస్తువానికి దగ్గరగా దర్బారు

- మరింత విశాలంగా మార్పులు
- గాలి వెలుతురు వచ్చేలా ఈశాన్యాన గోడలు తొలగింపు
- నేడే మహా విష్ణువుగా సత్యదేవుని దర్శనం
- ఈఓ చంద్రశేఖర్ అజాద్



గాలి వెలుతురు వచ్చేలా ఏర్పాటు చేసిన మెష్



రెండు మండపాల మధ్య గోడను తొలగించి ఫ్లోరింగ్ సరిచేయడంతో విశాలంగా కనిపిస్తున్న దర్బారు మండపం

అన్నవరం: రత్నగిరీశుని ఆలయంలో ఉత్సవ మూర్తులు కొలువై ఉండే దర్బార్ మండపాన్ని వాస్తుపరంగా, భక్తులకు సౌకర్యవంతంగా గతం కంటే రెట్టింపు విశాలంగా తీర్చిదిద్దారు. తొలి ఏకాదశి సందర్భంగా గురువారం ఈ మండపంలో సత్యదేవుడు మహావిష్ణు రూపంలో చతుర్భుజాలు, శంఖుచక్రనామాలు, గద, శార్ఙంతో, వక్షస్థలాన లక్ష్మీదేవి సమేతుడై కనువిందు చేయనున్నారు.

గతంలో సత్యదేవుని దర్శనానంతరం భక్తులు దర్బారు మండపంలోని దేవేరి సమేతుడైన స్వామివారి ఉత్సవమూర్తులను దర్శించి పూజలు చేసేవారు. ఈ ఉత్సవమూర్తులను స్వామివారి ప్రధానాలయంలోకి మార్చారు. దానికి తోడు ఈ మండపంలో ఆయుష్య, లక్ష్మీ హోమాలు నిర్వహిస్తుండడం వల్ల మండపం పొగబారి కళ తప్పింది. దీనికి తోడు వాస్తు లోపాలను గుర్తించి మార్చారు.

దర్బారు మండపానికి పూర్వ వైభవం

ఈ మండపానికి పూర్వ వైభవం వచ్చేలా ఈఓ చంద్రశేఖర్ అజాద్ పలు మార్పులు చేయించారు. ఏనుగుల మండపం కన్నా దర్బారు మండపం ఫ్లోరింగ్ వాస్తుకు విరుద్ధంగా ఎత్తుగా ఉన్న విషయాన్ని గుర్తించారు. అంతే కాకుండా రెండు మండపాల మధ్య గోడను తీసివేయడం ద్వారా దర్బారు మండపం మరింత విశాలమవడంతో పాటు భక్తులకు మరంత సౌకర్యవంతంగా ఉంటుందని భావించి ఈ నెల మొదటి వారంలో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఈశాన్య భాగంలో గోడలు ఉండడం వల్ల గాలి, వెలుతురు కూడా రావడం లేదని భావించి ఆ గోడలను తీసివేసి మెష్ ఏర్పాటు చేశారు. ఈ పనులన్నీ దాదాపుగా పూర్తయ్యాయి. వాస్తుకు విరుద్ధంగా ఏనుగుల మండపం ఫ్లోరింగ్ కన్నా ఎత్తుగా ఉన్న ఫ్లోరింగ్ ను తీసి కొంచం దిగువకు గ్రానైట్ ఫ్లోరింగ్ చేయించారు. దీంతో ప్రస్తుతం ఈ మండపం భక్తులకు చాలా సౌకర్యవంతంగా ఉంది.

దర్బారు మండపంలో ఉత్సవమూర్తులు

కాగా, తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా గురువారం నుంచి జూలై మూడో తేదీ వరకు దర్బారు మండపంలో విష్ణుమూర్తి అలంకరణలో నిలువెత్తు రూపంలో సత్యదేవుడు దర్శనమివ్వనున్నారు. అలాగే స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తుల దర్శనానికి కూడా భక్తులను అనుమతించనున్నారు. మూడో తేదీన ఆషాఢపూర్ణిమ సందర్భంగా అమ్మవారిని శాకంబరిగా అలంకరించనున్నారు. గురువారం తీర్థప్రసాదాల పంపిణీకి అనుగుణంగా మండపం వద్ద క్యూలైన్లు నిర్మించనున్నారు.

భక్తుల సౌకర్యం కోసమే



సత్యదేవుని దర్శనం అనంతరం నేరుగా దర్బారు మండపం వద్దకు వచ్చి అక్కడ స్వామి, అమ్మవారిని దర్శించి తీర్థ, ప్రసాదాలు స్వీకరించేందుకు వీలుగా మండపాన్ని విశాలం చేశాం. వాస్తుపరంగా మరిన్ని మార్పులు చేశాం. ఈ మార్పులు భక్తులకు మరింత సౌకర్యాన్ని కల్పిస్తాయి.

– ఈఓ. చంద్రశేఖర్ అజాద్

క్లుప్తంగా

మొన్న ఫెయిల్..
నిన్న స్కూల్ టాపర్!

టెన్త్ రీ వాల్యుయేషన్‌లో బయటపడ్డ ఉపాధ్యాయుడి నిర్వాకం

రామచంద్రపురం రూరల్: **పదో తరగతి** పరీక్షల్లో పేపర్ వాల్యుయేషన్ **చేసిన ఉపాధ్యాయుడి** తప్పిదం వల్ల ప్ర**తిభ గల విద్యార్థి** ఫెయిల్ అయిన ఘటన మండలంలోని వెల్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థికి ఎదురైంది. అన్ని సబ్జెక్టుల్లోనూ 90 మార్కులు పైబడిన విద్యార్థి గీసాల దుర్గాప్రశాంత్‌కు మే నెలలో విడుదలైన ఫలితాల్లో సోషల్ స్టడీస్‌లో 15 మార్కులు మాత్రమే వచ్చాయి. పాఠశాల టాపర్‌గా నిలవాల్సిన విద్యార్థి ఫెయిల్ అవ్వడంపై అనుమానం రావడంతో సోషల్ స్టడీస్ సబ్జెక్ట్‌ను రీవాల్యుయేషన్ చేయించగా మంగళవారం ఫలితాన్ని విడుదల చేశారు. ఫలితాల్లో విద్యార్థి మార్కులు 15 నుంచి 94కు పెరగడంతో పాటు మొత్తం మార్కులు 568కు పెరిగి పాఠశాల టాపర్‌గా నిలిచాడు. వాల్యుల్యూషన్ టీచర్ చేసిన తప్పిదానికి పాఠశాల టాపర్ స్థానంలో జగనన్న ఆణిముత్యాలు పథకం ద్వారా పొందాల్సిన గౌరవాన్ని పొందలేకపోయాడు.

కుష్ఠు వ్యాధిని పారదోలాలి


క్షేత్ర స్థాయి పర్యవేక్షణ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): కుష్ఠు వ్యాధిని నిర్మూలన కోసం వైద్యాధికారులు సిబ్బంది క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ తిరిగి అనుమానిత కేసులు ఉంటే వారిని పరీక్షించి తగు సూచనలు సలహాలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు సూచించారు. లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపెయిన్‌లో భాగంగా బుధవారం స్థానిక రాజేంద్రనగర్ కాలనీలో ఇంటింటి సర్వేను ఆయన పర్యవేక్షించారు. అనుమానిత మచ్చలు ఉన్న వారిని ఆసుపత్రికి రిఫర్ చేయాలని సిబ్బందికి సూచించారు. సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఒక అనుమానత మచ్చలు ఉన్న వ్యక్తిని పరీక్షించి సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లా నుంయి కుష్ఠు వ్యాధిని పారదోలాలని ఆయన సిబ్బందికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాణాలు పెంచే ప్రణాళిక

- డిగ్రీ విద్యలో సమూల సంస్కరణలు
- ఇప్పటి వరకు మూడు సబ్జెక్టులతో
- ఇకపై మేజర్, మైనర్ సబ్జెక్టుల కాంబినేషన్‌తో అండర్ గ్రాడ్యుయేషన్
- ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు



రాయవరం: ప్రభుత్వం విద్యా ప్రమాణాలను పెంచేందుకు పలు రకాల సంస్కరణలను ప్రవేశ పెడుతోంది. ఇప్పటికే ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల స్థాయిలో విద్యా సంస్కరణలను ప్రవేశ పెట్టారు. నూతన విద్యా విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అండర్ గ్రాడ్యుయేషన్ (యూజీ) విద్యలో సింగిల్ సబ్జెక్టు మేజర్‌గా నూతన విద్యా ప్రణాళిక (కరిక్యులమ్)ను ప్రవేశ పెట్టింది. ఇప్పటి వరకు డిగ్రీలో మూడు సబ్జెక్టుల ప్రధాన కాంబినేషన్‌తో విద్యాబోధన సాగుతుండగా, ఇకపై మేజర్ సబ్జెక్టు ప్రధానంగా డిగ్రీ కొనసాగుతుంది. ఈ విద్యా సంవత్సరం నుంచే నూతన విధానం అమల్లోకి వచ్చింది. ఈ మేరకు విద్యా ప్రణాళికను మార్పు చేస్తూ ఉన్నత విద్యామండలి తీసుకున్న నిర్ణయాన్ని క్షేత్ర స్థాయిలో అమలు చేస్తున్నారు. ఏదైనా ఒక సబ్జెక్టులో విద్యార్థులు సంపూర్ణ నైపుణ్యాలను సాధించే దిశగా విద్యా ప్రణాళికను అమల్లోకి తీసుకువచ్చారు.

సమూల సంస్కరణల దిశగా..

గతంలో అండర్ గ్రాడ్యుయేషన్‌లో బీఏ తీసుకున్న విద్యార్థులకు ప్రధానంగా హిస్టరీ, పాలిటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ కాంబినేషన్‌తో ప్రధాన సబ్జెక్టులను తప్పనిసరిగా అభ్యసించాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ మూడింటిలో తమకు నచ్చిన ఒక సబ్జెక్టును మేజర్‌గా ఎంపిక చేసుకుంటే, రెండో సెమిస్టర్‌లో యూనివర్శిటీలో అమలు చేస్తున్న దాదాపు 155 కోర్సుల నుంచి విద్యార్థులు తమకు నచ్చిన ఓ మైనర్ సబ్జెక్టును ఎంపిక చేసుకోవచ్చు. ఈ కోర్సుల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కోర్సులు కూడా ఉంటాయి. ఈ రెండు మేజర్, మైనర్ సబ్జెక్టుల్లో ఏదో ఒక దానితో పీజీ విద్య వరకు అభ్యసించేలా సంస్కరణలు చేశారు.

మూడు ప్రధాన డిగ్రీల్లో అమలు

యూజీ విద్యలో మేజర్ సబ్జెక్టుతో పాటు కచ్చితంగా ఓ మైనర్ సబ్జెక్టు చదవాలి. ఉదాహరణకు ఒక సైన్స్ విద్యార్థి మైనర్ సబ్జెక్టుగా ఆర్థిక శాస్త్రం, చరిత్ర, సంగీతం, యోగా, డేటా సైన్స్, మార్కెటింగ్..ఇలా ఇతర ఏ సబ్జెక్టునైనా ఎంపిక చేసుకోవచ్చు. ఆర్ట్స్ విద్యార్థులు మైనర్ కోర్సుల్లో భాగంగా ఇంటర్మీడియెట్ ఆధారంగా తమకు నచ్చిన సబ్జెక్టు తీసుకోవచ్చు. కొత్త విధానాన్ని బీఎస్సీతో పాటు బీఏ, బీకామ్‌లో అమలు చేయనున్నారు. డిగ్రీ పూర్తికాగానే ఉద్యోగ అవకాశాలను పెంపొందించడంతో పాటు ఇంజినీరింగ్‌తో సమానంగా మానవ వనరులను తీర్చిదిద్దేందుకు ఈ విద్యా సంస్కరణలు దోహదం చేస్తాయి. కొత్త విధానంపై డిగ్రీలో చేరే విద్యార్థులకు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ అవగాహన కల్పిస్తున్నారు.

నాలుగో ఏడాది డిగ్రీకి అనుమతి

నూతన జాతీయ విద్యా విధానం-2020ను దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో అమలు చేస్తున్నారు. యూజీసీ ఫ్రేమ్ వర్క్స్ ప్రకారం యూజీ విద్యను రెండు విధాలుగా విభజించారు. మూడేళ్ల డిగ్రీలో 75 శాతం మార్కులు సాధించినవారు రీసెర్చ్ హానర్స్ డిగ్రీ కోర్సులో చేరవచ్చు. ఇది పూర్తి చేసినవారు పీజీ లేకుండా నేరుగా పీహెచ్‌డీ కోర్సుకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. మూడేళ్ల కోర్సులో ఉత్తీర్ణులైతే జనరల్ హానర్స్ కోర్సును అభ్యసించవచ్చు. ఇది పూర్తి చేసిన వారు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో రెండో ఏడాదిలో చేరవచ్చు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో హానర్స్ కోర్సులను అందించేందుకు నిబంధనలు విధించారు. మూడేళ్లలో వరుసగా 30 శాతం అడ్మిషన్లతో పాటు సంబంధిత కోర్సుల్లో ఇద్దరు డాక్టరేట్ కలిగిన ప్రొఫెసర్లు ఉంటేనే హానర్స్ కోర్సుల బోధనకు అనుమతి మంజూరు చేస్తారు.

డిగ్రీ కళాశాలలు ఇలా..

జిల్లా	ప్రభుత్వ	ప్రైవేట్	అటానమస్
కోనసీమ	07	45	01
తూర్పు	06	40	01
కాకినాడ	05	46	03

కొనసాగుతున్న అడ్మిషన్ల ప్రక్రియ

2023-24 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ నెల 19 నుంచి 24 వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేసుకున్నారు. ఈ నెల 26 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లను విద్యార్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. జూలై 3న అడ్మిషన్లు కేటాయించి, 4వ తేదీ నుంచి డిగ్రీ తరగతులు నిర్వహించనున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

మరో ఇద్దరికి రూ.10 వేల చొప్పున జరిమానా

జగ్గంపేట: మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురిని కోర్టులో హాజరు పరచగా ఇద్దరికి జైలు శిక్ష, మరో ఇద్దరికి రూ.20 వేలు జరిమానా విధించినట్లు జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. జగ్గంపేటలో రాత్రి సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా బి.రంజిత్, యు.శ్రీను, డి.వీరబాబు, ఎన్.గుర్రయ్య మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టు పడ్డారని తెలిపారు. వీరిని పెద్దాపురం కోర్టులో మంగళవారం హాజరపరచగా మేజిస్ట్రేట్ జి.హర్షవర్ధన్ బి.రంజిత్, యు.శ్రీనులకు రూ.10వేల చొప్పున జరిమానా విధించారని తెలిపారు. డి.వీరబాబుకు రెండు రోజులు, ఎస్.గుర్రయ్యకు ఐదురోజులు జైలు శిక్ష విధించారని వివరించారు.

ప్రేమ పేరుతో మోసగించిన యువకుడిపై పోక్సో కేసు

నిడదవోలు రూరల్: మండలంలోని కోరుమామిడి గ్రామానికి చెందిన బాలిక (17)ను ప్రేమపేరుతో మోసం చేసిన బట్టు నరేంద్ర అనే యువకుడిపై పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ బుధవారం తెలిపారు. కోరుమామిడి గ్రామానికి చెందిన బట్టు లక్ష్మి కుమారుడు నరేంద్ర అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ పర్యవేక్షణలో విచారణ చేపడుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

2024 ఎన్నికల్లో విజయఢంకా మోగిద్దాం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- టీడీపీ నాయకుడు రామసతీష్‌తో సుమారు 200 మంది వైఎస్సార్ సీపీలో చేరిక


కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ తోట, ఎమ్మెల్యేలు రాజా, డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మళ్లీ విజయఢంకా మోగించేందుకు ప్రతీ ఒక్కరూ సైనికుల్లా పనిచేద్దామని పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. మండలంలోని దుప్పలపూడికి చెందిన టీడీపీ నాయకులు వల్లభశెట్టి రామసతీష్, అనుచరులు సుమారు 200 మందితో కలిసి బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా గ్రామంలోని కల్యాణ మంటపంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని జక్కంపూడి రాజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పారదర్శక పాలన, అవినీతి రహితంగా సంక్షేమ పథకాలు అమలు చేయడంతో ప్రజలు ఆకర్షితులవుతున్నారని అన్నారు. దీంతో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో అనపర్తి నియోజకవర్గ ప్రజలు ఏపనికైనా అప్పటి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి వ్యక్తిగత ట్యాక్స్ కట్టాల్సి వచ్చేదని విమర్శించారు. అనంతరం 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీచేసి అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రజా సేవే పరమావధిగా నియోజకవర్గ ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతున్నాయని, పార్టీ అధినాయకత్వం, స్థానిక నాయకత్వంపై ఉన్న నమ్మకంతో ఇతర పార్టీలకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని తెలిపారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలను కాపు సామాజిక వర్గీయులు విజ్ఞతతో ఆలోచించాలని కోరారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ముంగిటకే పాలనను తీసుకువచ్చారన్నారు. రోజురోజుకు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్న మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలోనే అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే పార్టీ నాయకులు, కార్యకర్తల అంతిమ లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ వి.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు అద్దంకి ముక్తేశ్వరరావు, కొల్లాటి ఇజ్రాయేల్, ప్రచార విభాగం కార్యదర్శి మండ రాజారెడ్డి, నియోజకవర్గ ప్రచార విభాగం కన్వీనర్ రొంగల అప్పాజీ, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న మాట్లాడారు. అనంతరం పార్టీలో చేరిన వారికి ముఖ్య అతిథులు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కొట్టేసిన నేరానికి.... కొన్న పాపానికీ...

- బైక్ దొంగల ఐదుగురితో పాటు కొన్న తొమ్మిది మంది అరెస్టు
- రూ.20.70 లక్షల విలువైన 41 ద్విచక్ర వాహనాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడిన ఐదుగురితోపాటు వాటిని కొనుగోలు చేసిన తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం కాకినాడలోని తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడుకు చెందిన కొమిరిశెట్టి వీరబాబు, బొర్రంపాలేనికి చెందిన సుభాసానిరాజు పొలం గట్లపై నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలను నకిలీ తాళంతో తీసి దొంగిలించేవారు. భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్న వీరిద్దరూ సునాయాసంగా డబ్బు సంపాదించే లక్ష్యంతో ఈ దొంగతనాలకు పాల్పడ్డారు. వీరు దొంగిలించిన 11 వాహనాలను యర్రవరానికి చెందిన ఉమ్మిడి దుర్గ, రంగంపేటకు చెందిన కానూరి శ్రీను, నందరాడకు చెందిన బడిదబోయిన దుర్గాప్రసాద్, బొర్రంపాలేనికి చెందిన గల్లా వెంకటేసులుకు విక్రయించారు. ఇద్దరు దొంగలతో పాటు వాహనాలు కొన్న నేరానికి కొన్న నలుగురిని గండేపల్లి పోలీసులు అరెస్టు చేశారు. మరో కేసులో అన్నవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 30 వాహనాలను రికవరీ చేశారు. ఈ వాహనాలను ఉప్పాడ కొత్తపల్లి గ్రామానికి చెందిన పట్నాల సాయి వెంకట్, డొప్పా దుర్గాప్రసాద్, బడ్జెట్ ఆదిత్య దొంగిలించారు. వీటిని అనకాపల్లి జిల్లా నక్కపల్లికి చెందిన బద్ద రవి, మసా శివకుమార్, ఉగ్గిన చిట్టిబాబు, సరికొండ వెంకటసాయి, గంటి నాగేశ్వరరావు కొన్నారు. దీంతో దొంగిలించిన ముగ్గురితో పాటు కొన్న ఐదుగురిని అరెస్ట్ చేశారు. రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో రూ.20.70 లక్షలు విలువ చేసే 41 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకున్న పోలీస్ బృందాలను ఎస్పీ అభినందించారు.

నేడు 55 పీజీటీ పోస్టులకు కౌన్సెలింగ్

రాయవరం, బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 55 పోస్టు గ్రాడ్యుయేషన్ టీచర్స్ (పీజీటీ) పోస్టులకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులుగా పనిచేస్తూ రెండేళ్ల సర్వీసు ఉన్నవారు, పీజీలో 50 శాతం ఉత్తీర్ణత సాధించి, బీఈడీ మెథడాలజీ ఉన్నవారు పీజీటీగా చేసేందుకు అర్హులు. పీఎస్ హెచ్‌ఎంగా పని చేసేవారు అనర్హులు. పీజీటీగా పనిచేసేందుకు అర్హత కలిగి ఉండి, ఆసక్తి ఉన్నవారు కాకినాడ సమగ్ర శిక్షా సమావేశపు హాలులో మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీఈవో అన్నపూర్ణ తెలిపారు. బోటనీ-11, జువాలజీ-12, కెమిస్ట్రీ-15, ఫిజిక్స్-11, సివిక్స్-3, కామర్స్, ఎకనామిక్స్, తెలుగు ఒక్కొక్క పీజీటీ పోస్టుకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

గుర్తింపు ఉన్న పాఠశాలల్లోనే చదివించండి

సీబీఎస్ఈ పాఠశాలల జాబితా విడుదల చేసిన డీఈవో

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలో కొన్ని యాజమాన్యాలు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్ బోధించేందుకు అనుమతి లేకపోయినా విద్యార్థులను నమ్మించి చేర్చుకుంటున్నారని, దీనిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం బుధవారం తెలిపారు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్ ఉన్న పాఠశాలల వివరాలను అందిస్తున్నామని, తల్లిదండ్రులు ఆ విద్యాసంస్థల్లోనే పిల్లలను చేర్పించాలని తెలిపారు.

2023-2024 విద్యాసంవత్సరంలో సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్ అందిస్తున్న పాఠశాలలు

షిర్డీ సాయి విద్యానికేతన్ (ఇంగ్లిష్ మీడియం) కడియం, లారెల్ హైస్కూల్, కోరుకొండ, ఏకేఆర్‌జీ ప్రాథమికోన్నత పాఠశాల (ఇంగ్లిష్ మీడియం, నల్లజర్ల), ఏకేఆర్‌జీ ఉన్నత పాఠశాల (ఇంగ్లిష్ మీడియం), నల్లజర్ల, బెతెస్త క్రిస్టియన్ అకాడమీ, నల్లజర్ల, ఇంటర్నేషనల్ ఢిల్లీ హైస్కూల్, (ఇంగ్లీష్ మీడియం) ప్రకాశరావుపాలెం, నల్లజర్ల, ఏకేఆర్‌జీ ఉన్నత పాఠశాల, (ఇంగ్లిష్ మీడియం) నిడదవోలు, శశి హైస్కూల్, (ఇంగ్లిష్ మీడియం) కానూరు, పెరవలి, లోటస్ హైస్కూల్, (ఇంగ్లిష్ మీడియం), బుచ్చయ్య నగర్, రాజమహేంద్రవరం రూరల్, త్రిపుర (ఇంగ్లిష్ మీడియం), పిడింగొయ్యి, రాజమహేంద్రవరం రూరల్, సెయింట్ ఆన్స్, రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం అర్బన్, శ్రీ సత్యసాయి గురుకులం హైస్కూల్, (ఇంగ్లిష్ మీడియం) రాజమహేంద్రవరం అర్బన్, శ్రీ పకాష్ హైస్కూల్, (ఇంగ్లిష్ మీడియం) దివాన్ చెరువు, రాజానగరం, శ్రీ ప్రకాష్ ప్రైమరీ స్కూల్, (ఇంగ్లిష్ మీడియం) దివాన్ చెరువు, రాజానగరం, శశి హైస్కూల్, (ఇంగ్లిష్ మీడియం) వేలివెన్ను, ఉండ్రాజవరం, ఓక్ వుడ్స్ ప్రైమరీ స్కూల్, (ఇంగ్లిష్ మీడియం) దివాన్ చెరువు, రాజానగరం, ఓక్ వుడ్స్ హైస్కూల్, (ఇంగ్లిష్ మీడియం) దివాన్ చెరువు, రాజానగరం, భారతీయ విద్యా భవన్ ప్రాథమికోన్నత పాఠశాల, (ఇంగ్లిష్ మీడియం), నామవరం.

రిజర్వ్ బ్యాంక్ క్విజ్ పోటీకి అనూహ్య స్పందన


విజేతలైన విద్యార్థులతో బ్యాంకు, విద్యాశాఖాధికారులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): భారత రిజర్వ్ బ్యాంకు ఆర్థిక సమీకృత అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న క్విజ్ పోటీలకు అనూహ్య స్పందన లభించిందని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ డీవీ ప్రసాద్ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించి బుధవారం విజేతలకు బహుమతులను అందచేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు ఆర్థిక వనరులు, అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో ఆల్ ఇండియా ఫైనాన్షియల్ లిటరసీ పై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూచనలను అనుసరించి క్విజ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు అందరికీ సాధారణ పొదుపు వివరాలు, ఆదాయ, వ్యయాలు, బేసిక్ బ్యాంకింగ్, డిపాజిట్లు, డెబిట్ కార్డులు, క్రెడిట్ కార్డులు, చెక్ బుక్, వివిధ రకాల బ్యాంకు ఖాతాలు, బ్యాంకుకు సంబంధించిన మౌలిక భావనలు, ఈ మధ్య విపరీతంగా ఉపయోగిస్తున్న డిజిటల్ పేమెంట్స్ అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండేలా ఈ క్విజ్ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. కార్యక్రమానికి పరిశీలకులుగా అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ వ్యవహరించారు. 18 మండలాల్లోని పాఠశాలల నుంచి స్కూల్‌కి ఇద్దరు చొప్పున 36 మంది విద్యార్థులు, ఒక గైడ్ టీచర్ క్విజ్‌లో పాల్గొన్నారు. ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.7 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు విద్యార్థుల ఖాతాలో జమ కానున్నాయని డీఐ దిలీప్‌కుమార్ తెలిపారు. జిల్లా స్థాయి లో ప్రథమ బహుమతి పొందిన ఇద్దరు విద్యార్థులు వచ్చేనెల 14 న విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ జి.శ్రీధర్, రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

15 వరకు ఉత్తమ ఉపాధ్యాయ దరఖాస్తుల స్వీకరణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చేనెల 15వ తేదీ వరకు సమయం ఉందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం బుధవారం తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లాపరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్, పురపాలక యాజమాన్యాలు గల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేసే అన్ని కేటగిరీలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు 'జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ 2023కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తిగలవారు నేషనల్ అవార్డ్స్ టు టీచర్స్ 2023 వెబ్‌సైట్ ద్వారా వచ్చేనెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో ప్రతిపాదనలు సమర్పించాలన్నారు.